రొద్దంలో వైసిపి సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

# రైతుల పక్షాన పోరుకు సిద్ధం : వైసిపి

**ప్రజాశక్తి - సోమందేపల్లి**

రైతుల పక్షాన పోరుకు వైసిపి సిద్ధమైందని ఆపార్టీ స్థానిక నాయకులు తెలిపారు. రైతు సమస్యలపై ఈనెల 13న వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ ఆధ్వర్యంలో పుట్టపర్తి వైసిపి కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర, కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమానికి మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ గజేంద్ర కోరారు.

**రొద్దం :** వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 13 న శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో జరిగే రైతన్నల శాంతీయుత ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, మండల కన్వీనర్ తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, కుర్లపల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, సోమందేపల్లి డిసి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాలకు నగారా

- వెలువడిన నోటిఫికేషన్
- ఈనెల 14న సాగునీటి సంఘాలకు....
- 17న డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు బుధవారం నాడు ఎన్నికల నోటిఫికేషన్‌ను అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్ విడుదల చేశారు. ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగనున్నాయి. డిస్ట్రిబ్యూటరీలకు ఈనెల 17వ తేదిన ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటికే జలవనరుల శాఖ అధికారులు ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెట్టారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేవారు ఇప్పటికే సన్నద్ధమై ఉన్నారు. నోటిఫికేషన్ కూడా రావడంతో రాజకీయ వాతావరణం కూడా వేడెక్కింది.

అనంతపురం జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ప్రకారం 54 మేజర్ సాగునీటి సంఘాలు, ఆరు మీడియం సాగునీటి సంఘాలు, 89 మైనర్ సాగునీటి సంఘాలున్నాయి. వీటన్నింటికీ ఈనెల 14వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఇక ఆరు డిస్ట్రిబ్యూటరీలకు ఈనెల 17వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. ఈ మేరకు ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం సిద్ధమైంది. వాస్తవానికి సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగి చాలాకాలమైంది. 2015లో ఎన్నికలు జరిగాయి. 2020తో వీటికి పదవీకాలం పూర్తయ్యింది. ఆ తరువాతి నుంచి ఎన్నికల్లేవు. వైసిపి హయాంలో పూర్తిగా ఈ ఎన్నికలపై దృష్టి సారించలేదు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఎన్నికలపై దృష్టి సారించింది. అక్టోబర్‌లోనే ఎన్నికల కసరత్తును ప్రారంభించినప్పటికీ వరదలు, ఇతర కారణాలతో వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు నోటిఫికేషన్ రావడంతో ఎన్నికలు రెండు రోజుల్లో లాంఛనం కానున్నాయి.

**వైసిపి పాల్గొనేనా.?**

సాగునీటి సంఘాల ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరుగుతున్నప్పటికీ సాధారణంగా ఈ ఎన్నికల్లోనూ రాజకీయపార్టీలు తమ అభ్యర్థులను బరిలో దింపుతూ ఉంటాయి. ఏ ఎన్నికలైనా రాజకీ యాలతోనే ముడి పడి ఉంటాయి. 2024 ఎన్నికల్లో ఘోర ఓటమి తరువాత ఇంకా కోలుకోలేని స్థితిలో వైసిపి ఉంది. ఆ పార్టీ నాయకుల్లోనూ అంతటి ఉత్సహం లేదు. నియోజకవర్గ సమన్వయకర్తలు కూడా ఇంకా రాజకీయాల వైపు దృష్టి సారించిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలు ఏకపక్షంగానే సాగుతాయా అన్నది చూడాల్సి ఉంది. అధికార తెలుగుదేశం నాయకులు మాత్రం ఇప్పటికే సాగునీటి సంఘాలకు పోటీపడే వారు సిద్ధమై ఉన్నారు. ఎవరైతే బాగుంటుందన్న దానిపైనా ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది . సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా ఈ ఎన్నికలు సాగే అవకాశాలే అధికంగానున్నట్టు తెలుస్తోంది. దీంతో రాజకీయంగా అంతటి హడావుడి ఎక్కడా కనిపంచడం లేదు. మొక్కుబడిగా అన్నట్టుగానే ఈ ఎన్నికలు సాగే అవకాశాలే అధికంగా కనిపిస్తున్నాయి.

బాధితురాలితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

# బాధితురాలికి సిపిఎం పరామర్శ

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

కొత్త చెరువు మండల సమాఖ్య అధ్యక్షురాలి ఎంపిక విషయంలో జరిగిన ఘటనలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన స్థానిక బీసీ కాలనీకి చెందిన నాగమణిని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, సిపిఎం నాయకులు పరామర్శించారు. అండగా ఉంటామని ఆమెకు భరోసా ఇచ్చారు. ఒళ్లంతా బొబ్బలు వచ్చి నడవలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్న తనను సొంత పార్టీ వారు ఇప్పటివరకు స్పందించి పలకరించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ మొత్తం 43 సంఘాల లీడర్లను పిలిపించి ఉన్నత స్థాయి అధికారుల సమక్షంలో ఎన్నికలు జరిపి మెజార్టీ అభిప్రాయం మేరకు అధ్యక్షులను ఎన్నిక చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాగమణికి అన్ని విధాల న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముత్యాలు, బ్యాల్లఅంజి, వెంకటరాముడు, వెంకటేష్, కేశప్ప, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి వెంకటేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి, సభ్యులు శ్రావణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌కమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

# సిఐటియు నాయకులపై ఫుడ్ కమిషన్ చైర్మన్ దురుసు ప్రవర్తన

**ప్రజాశక్తి -పెనుకొండ టౌన్**

సిఐటియు నాయకులపై ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆయన వైఖరిపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూట్యూబ్ ఛానల్‌లో ప్రచారం చేసుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగంచేయడం అందర్నీ బెదిరించి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. అంగన్వాడీ,మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సమయంలో విజయ్ ప్రతాప్ రెడ్డి సిఐటియు నాయకులపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని విన్నవించడానికి వస్తే ఇలా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు హరి, మండల నాయకులు మహబూబ్ బాషా, ఆటో నాగప్ప, అజయ్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

# నేతల హామీ.. కార్మికుల సమ్మె విరమణ

**ప్రజాశక్తి-హిందూపురం**

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న నీటి సరఫరా, లైటింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి కార్మికులు గత రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నాడు మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, వైస్ ఛైర్మన్ జబీవుల్లాలు సమ్మె శిబిరానికి వచ్చి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ ఎళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని చెప్పారు. టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ 24,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏడాదికి 72 రోజులు సెలవులు లేదా వేతన పని దినాలుగా ప్రకటించాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణకు శరీరం సహకరించని కార్మికులకు ప్రభుత్వపరంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య శాతాన్ని బట్టి ఆయా కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. సీనియారిటీ ప్రాతిపదికన వేతనాలు చెల్లించాలని, కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అన్ని పథకాలను తమకు వర్తింపజేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిల్ చర్చించి, కౌన్సిల్‌లో అమోదం తెలుపుతామన్నారు. సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకుంటామని చెప్పారు. కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేయడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని సమ్మె విరమించాలని కోరారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ తో పాటు పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు సమ్మె శిబిరానికి వెళ్లి కార్మికులతో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే బాలకృష్ణ మున్సిపల్ శాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రితోనూ చర్చించారన్నారు. ఆర్థిక పరమైన అంశం కావాడంతో కాస్త ఆలస్యం అవుతోందని, అయినప్పటికీ వేతనాలను పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. కార్మికుల సమస్యలను తెలిపేందుకు మున్సిపల్ శాఖ మంత్రిని కలిసేలా అవకాశం ఇస్తామన్నారు. అంతవరకు సమ్మెను విరమించి, విధులకు హాజరు కావాలని కార్మికులను కోరారు. దీనిపై కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతు అందరి హామీ మేరకు తాత్కలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రఘు, కె.కోటేశ్వర్, కె.బాబా, కె.కగ్గల్లప్ప, ఎస్.అంజి, క్రిష్ణ, శీన, జనార్ధన్, నాగరాజు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న చైర్మన్ బలరామిరెడ్డి

గ్రంథాలయ అధికారికి డీఎస్సీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

# గ్రంథాలయానికి డీఎస్సీ మెటీరియల్ అందజేత

**ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్**

స్థానిక తహశీల్దార్ నీలకంఠారెడ్డి తన సొంత నిధులతోకొత్తచెరువు గ్రంథాలయానికి డీఎస్సీ మెటీరియల్ వితరణ చేశారు. బుధవారం మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వీటిని గ్రంథాలయ ఇన్‌ఛార్జి జయరాంకు అందజేశారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# మట్టి తరలింపుదారులపై చర్యలకు డిమాండ్

**ప్రజాశక్తి - ముదిగుబ్బ**

మండల కేంద్రంలోని జాతీయ రహదారి హైవే వడ్డీపేట సమీపాన ప్రభుత్వ భూమిలో ఎర్ర మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సాయి గీతాకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు బండల వెంకటేష్ ,రైతు సంఘం పోతులయ్య, మునాఫ్ ,అవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్ , మునాఫ్, టైలర్ ముత్తు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యత పాటించాలని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప ఆదేశించారు. బుధవారం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ ప్రాథమికోత పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సంబంధిత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంగప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలన్నారు. భోజన పథకం పట్ల ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఇఓ

# యుటిఎఫ్ సేవలు ఆదర్శనీయం : డిఇఒ

మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి- పెనుకొండ**

విద్యాభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న సేవలు అభినందనీయమని డిఇఒ కిష్టప్ప పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించే మోడల్ పేపర్లను శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారి జి. క్రిష్టప్ప మండల పరిధిలోని గుట్టూరు జెడ్‌పిహెచ్ఎస్ లో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి,యం. సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏడాది మోడల్ పేపర్ల తయారుచేసి విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. మోడల్ పేపర్ల రూపకల్పనలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రూపొందించారన్నారు. అతి తక్కువ ధరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు 100 రోజుల ప్రణాళిక తో తయారుచేయడం గొప్పవిషయం అన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్ నుంచి ప్రతి ఏడాది 70 నుంచి 80 మార్కుల ప్రశ్నలు వస్తున్నాయని, ఈ మోడల్ పేపర్ గ్రామీణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు చంద్రశేఖర్, సుధాకర్, గుట్టూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగార్జునుడు, సీనియర్ నాయకులు నారాయణ స్వామి,జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, రమేష్, ఉపేంద్ర, ఆదిజినేష్, పెద్ది రాజు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కదిరిటౌన్**

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు కదిరప్ప డిమాండ్ చేశారు. కదిరి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా కదిరప్ప మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరికీ ఒకటే వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్లో ఉన్న ఏడు నెలల వేతనాలను చెల్లించాలన్నారు. సమ్మె కాలంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ ను ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సి సెల్ నాయకులు భాస్కర్, నరసింహులు, గంగన్న, వెంకటేష్, వేమ నారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్మికులు

# గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి పనిచేద్దామనిఎంపీపీ బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌జిఎస్ఎకార్యాచరణ ప్రణాళిక 2024-25 రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. గ్రామాలు అభివృద్ధి బాట పడితేనే మండలం అభివృద్ధి చెందినట్లు అన్నారు. పంచాయతీలకు, మండలానికి మంజూరు అయ్యే గ్రాంట్లుతో అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహానాయుడు, ఇఒఆర్‌డి క్రిష్టప్ప, ఏఇ శ్రీనివాసులుతో పాటు ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

విద్యార్థులు చదువులతో పాటు క్రీడలలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సత్య సాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రికెట్ కిట్టు, క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులలో కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, క్రీడలలో గెలుపు ఓటములను క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్, అధ్యాపకులు ఓబులేసు, టిడిపి నాయకులు ఈశ్వరయ్య, మంజునాథ్, దిలీప్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డిఎలు, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే నూతన సంవత్సర కానుకగా ప్రకటించాలని ఎస్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న డిఎలను, ఐఆర్ ను ప్రకటించాలన్నారు. వీలైనంత త్వరగా 12వ పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల సూచికకు అనుగుణంగా డిఎలను, పి ఆర్ సి ని ప్రకటించి ఉద్యోగులకు ఉపశమనం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్, మండల అధ్యక్షులు షమీవుల్లా, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఆర్థిక కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

## 13న పిఎం సూర్యఘర్‌పై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

ప్రధానమంత్రి సూర్యఘర్ సబ్సిడీ పథకంపై విద్యుత్ వినియోగదారులకు ఈనెల 13న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బత్తలపల్లి ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లి లోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఈనెల 13న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ పొదుపు,వినియోగదారుల ప్రయోజనార్ధం ప్రధానమంత్రి సూర్యఘర్ సబ్సిడీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వినియోగదారులు తమ ఇంటిపై సోలార్ రూట్ టాప్ నిర్మించుకొని విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పిస్తారన్నారు.

## 14న సాగునీటి సంఘాల ఎన్నికలు

**ప్రజాశక్తి-నంబులపూలకుంట**

మండల పరిధిలోని వంకమద్ది, ధనియానిచెరువు, పెడబల్లి సాగు నీటి చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. వంకమద్ది చెరువుకు వ్యవసాయాధికారి లోకేశ్వర రెడ్డి, ధనియానిచెరువు ఎంఈవో గోపాల్ నాయక్,పెడబల్లి జలాశయానికి ఇరిగేషన్ ఎఇ మహేష్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఓటు హక్కుగల రైతులు శాంతియుతంగా సాగునీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకోవాలని పేర్కొన్నారు.

**గాండ్లపెంట :** మండల పరిధిలోని తూపల్లి పంచాయతీ సంబంధించి పోరెడ్డి చెరువు సాగునీటి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసినట్లు ఇరిగేషన్ జేఈ అరుణ మంగళవారం తెలిపారు సాగునీటి సంఘం ఎన్నికలను 14వ తేదీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని వివరించారు.

## ఘనంగా ఉరుసు ఉత్సవం

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీ కేంద్రంలోని దర్గాలో బుధవారం ఘనంగా సయ్యద్ బాబా ఉరుసు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాసన సభ్యులు నందమూరి బాలక్రిష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, బాలాజీ, టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, నందీశప్ప, బయపరెడ్డి, మల్లిరెడ్డి హాజరయ్యారు.

## సత్యసాయి పాఠశాలలో అడ్మిషన్లకు నోటిఫికేషన్

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం**

శ్రీ సత్యసాయి ప్రైమరీ పాఠశాల (హాస్టల్)లో ఒకటవ తరగతిలో చేరాలనుకునే బాల బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒకటవ తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు 1, ఏప్రిల్ 2019 నుంచి 2020 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. అర్హులు, ఆసక్తిగల వారు జనవరి 31వ తేదీ 2025 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఇంటర్లో చేరడానికి బాలురు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు సత్యసాయి ప్రైమరీ స్కూల్‌లో దరఖాస్తు ఫారాలు తీసుకోవచ్చన్నారు.

## జర్నలిస్టులు, పోలీసుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

**ప్రజాశక్తి - మడకశిర**

పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో బుధవారం స్నేహపూర్వకంగా పోలీసులు జర్నలిస్టుల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. 10 ఓవర్ల టెన్నిస్ బాల్ క్రికెట్ మ్యాచ్ ఆడారు.ఈ మ్యాచ్ లో ఆరు పరుగుల తేడాతో జర్నలిస్ట్ జట్టుపై పోలీస్ జట్టు విజయం సాధించింది.

## బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

బాల్య వివాహం ఒక సాంఘిక దురాచారం అని దీనిని పూర్తిగా నిర్మూలిద్దామని అధికారులు పిలుపునిచ్చారు. బుధవారం ధర్మవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గామ సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ అభివద్ధి అధికారి కలిసి బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలోని పాండురంగ నగర్‌లోనిఅయ్యప్ప స్వామి సన్నిధానంలో మాలాదారులకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 19 సంవత్సరాలుగా మాలధరించిన అయ్యప్ప భక్తులకు దాతల సహకారంతో మండల కాలం 41 రోజుల పాటు రాత్రి వేళల్లో అల్పాహార వినియోగం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మందిర్ ట్రస్ట్ కార్యదర్శి మేడం వరప్రసాద్, గురుస్వామి ప్లేట్ల వెంకటేష్, ఎం.బి. బాలచంద్ర, కట్ట రమేష్, ఎన్.బి.కె రమేష్, బి. జి.తిరుమలేష్, ముగుద విజయ్ కుమార్, పానీపురి శంకర్, డ్రమ్స్ రాజు, అజంతా రఘు, అనిల్, నిమ్మకాయల రాము, గోరంట్ల మంజునాథ్, నందిని విశ్వనాథ్, ఏకదంత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

అరుణాచలేశ్వర దేవాలయంలో ఈనెల 13న మహా దీపం, గిరిప్రదక్షిణ కార్యక్రమానికి సత్యసాయి జిల్లా నుండి అక్కడికి వెళ్లే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. ఈసందర్భంగా అక్కడ పాటించాల్సిన నియమాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుండి భారీ ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున అక్కడ ఇబ్బందులు ఎదుర్కోకుండా, సహాయం కోసం తిరువణ్ణమలై పోలీసులు చేసిన సూచనలు పాటించాలని కోరారు.

# ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించాలి

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-పెనుకొండ**

విద్యుత్ వినియోగదారులపై మోపిన ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం పెనుకొండ ట్రాన్స్‌కో ఏడీకి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం రూ. 15,441 కోట్ల అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని మోపిందన్నారు. మూడవ దఫా ట్రూ అప్ చార్జీలను వినియోగదారులపై మోపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని వాగ్దానం చేసిన కూటమి ఇప్పుడు మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. వెంటనే విద్యుత్ అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలని ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. అదానితో ఒప్పందం రద్దుచేసి తక్కువ ధరకు విద్యుత్ సరఫరా చేయాలని స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, కాంగ్రెస్ పార్టీ నిసార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిఐటియు నాయకులు మహబూబ్, బాషా, షేక్షావలి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా ఇసుక రవాణా

**ప్రజాశక్తి - అగళి**

అగళి మండలంలో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వంలో ఇల్లు కట్టుకోవడానికి ఇసుక దొరకక ఇబ్బందులు పడ్డారు. అవసరైన వారు ఐదేళ్లలో ఎద్దులబండితో ఇసుక తరలించుకున్నారు. అయితే టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 'కండువా వేసుకో ఇసుక తోలుకో' అన్నచందంగా పరిస్థితి తయారైంది. టిడిపి ప్రభుత్వం వచ్చిన మొదట్లోనే అగళి మండలం లోని చుట్టుపక్కల ఉన్న వంకలలో, సువర్ణముఖి వంకలలో ఇసుక తరలించడం ప్రారంభించారు. అప్పటినుంచి ఈరోజు వరకు ట్రాక్టర్లతో నిర్విరామంగా ఇష్టనుసారంగా ఇసుకను మండల సరిహద్దులు దాటిస్తున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా కర్నాటక రాష్ట్రంలోకి ఇసుక తరలిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

## బుక్కపట్నం చెరువు ఆయకట్టుకు నీరు విడుదల

**ప్రజాశక్తి - కొత్త చెరువు**

బుక్కపట్నం చెరువు కింద ఉన్న ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శివాలయం వద్ద ఉన్న తూము గేట్లను ఎత్తి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో అతి పెద్దదైన బుక్క పట్నం చెరువు కింద సుమారు నాలుగు వేల ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతోందన్నారు. వైసిపి పాలనలో చెరువులకు ఒక చుక్క నీరు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం చెరువులకు నీళ్లు ఇచ్చి రైతుల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. నీటిని పొదుపుగా వాడుకొని పంటలు పండించుకోవాలని కోరారు. చివరి అయకట్టువరకు నీటిని అందే విధంగా చూడాలని ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ గంగాధర్, ఏఈ సుధాకర్ రాజు, జమునబాయి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి

# ఉద్యమకారుడు పెద్దన్న మృతి... పలువురు నివాళి

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

విప్లవకారుడు ఉద్యమ నేత పెద్దన్న మృతి చెందారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి ప్రజల కోసం వారి పక్షాన నిలబడి జైలుకు సైతం వెళ్లిన కదిరి పట్టణం కుటాగుల గ్రామానికి చెందిన కామ్రేడ్ రవూఫ్ అనుచరుడులో ఒక్కడైనా ఎం పెద్దన్న (90) మృతిచెందారు. నక్సలైట్ లీడర్ ఎస్ఎ రవూఫ్ అనుచరుడుగా విప్లవ కార్యక్రమాల్లో పెద్దన్న చురుగ్గా పాల్గొన్నారు. ప్రజల పక్షాన నిలబడి ఎన్నో ఉద్యమాలను నిర్వహించి జైలుకు కూడా వెళ్లారు. విప్లవోద్యమ నేతలలో ఒకరైన కామ్రేడ్ ఎస్ఏ.రవూఫ్‌కు అనుచరుడుగా పేరుపొందిన ఈయన కమ్యూనిస్టు పెద్దన్నగా అందరికీ సుపరిచితుడు. కదిరి మున్సిపల్ పరిధి కుటాగుళ్ళ లో ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన పెద్దన్న చివరి వరకు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగించారు. వివక్షత లేని నూతన వ్యవస్థను నిర్మించే క్రమంలో ఆయన ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. పోలీస్ లాఠీ దెబ్బలను తట్టుకొని జైలు జీవితం గడిపారు. పోలీసు నిర్బంధంలో పెద్దన్న పై పోలీస్ థర్డ్ డిగ్రీ విధానం సంచలనం సృష్టించింది. చేతులను తాళ్లతో కట్టివేసి రెండు చెట్లకు ఊయలలాగా ఊపి చిత్రహింసలకు గురిచేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పెద్దన్న తన పోరాట చరిత్రలో మచ్చుతునకగా అందరి నోటా వినిపిస్తోంది. ఆరోగ్య సమస్యలు కుటుంబ ఒత్తిడిల నేపథ్యంలో కుటాగుళ సమీపంలోని పట్టు పరిశ్రమ శాఖలో కార్మికుడిగా తన జీవనాన్ని కొనసాగించారు. తనువు చాలించేంతవరకు ఏ రోజు విశ్రమించి ఎరుగని పెద్దన్న నిరంతరం వ్యవసాయ పనులు పశుపోషణలో తీరిక లేకుండా గడిపారు. పెద్దన్న మరణ వార్త విన్న పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వడ్లమూడి కృష్ణారావు మెమోరియల్ కమిటీ తరపున దేవా సుందరాలు అరుణ వస్త్రాన్ని కప్పి చైతన్య గీతాలను ఆలపింపజేసి నివాళులర్పించారు. పలువురు ఆయన భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పెద్దన్న (ఫైల్‌ఫొటో)

## డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు**

డ్రోన్ టెక్నాలజీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎ సనావుల్లా, సత్యనారాయణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని సున్నంపల్లిలో ముక్కెర నరసింహులు అనే రైతు పొలములో డ్రోన్ టెక్నాలజీ ద్వారా 13 ఎకరాల వేరుశనగ పంటకు మందులు స్ప్రే చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డ్రోన్స్ టెక్నాలజీని వాడటం ద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ ఎకరాలకు మందులు స్ప్రే చేయవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఇలియాస్, రైతు సేవా కేంద్రం అధికారి రాఘవేంద్ర యాదవ్, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్ వాడకాన్ని వివరిస్తున్న అధికారులు

## నాటుసారా తయారీదారులపై చర్యలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో నాటు సారా తయారుచేసినా,చ విక్రయించినా మద్యం అక్రమ రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొవిషన్ ఎక్సైజ్ సూపరిండెంట్ గోవింద నాయక్ హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ స్థావరాలపై క్లస్టర్ టీం తో పాటు ప్రత్యేక దాడులు చేస్తూ వాటిని అదుపు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 313 నాటుసారా కేసులు నమోదు చేశామని,410 మందిని అరెస్టు చేసి 466 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 54 వేల నాటు సారా లీటర్లను ధ్వంసం చేశామన్నారు. రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. కర్నాటక సరిహద్దు గ్రామాలలో మద్యం అక్రమ రవాణా కాకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 1,04,796 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. 480 కేసులు నమోదు చేసి, 417 మందిని నిందితులను అరెస్టు చేశామన్నారు. 20 వాహనాలను సీజ్ చేశామన్నారు. నాటు సారా తయారు చేసే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు నాటు సారా తయారీ తగ్గిందన్నారు.

# వసతిగృహాల తనిఖీ

**ప్రజాశక్తి-హిందూపురం**

ఫుడ్ కమిషన్ చైర్మేన్ విజయ ప్రతాప్ రెడ్డి బుధవారం పట్టణంలో పర్యటించారు. తొలుత సిపిఐ కాలనీలోని కెజిబివి బాలికల పాఠశాలను తనఖీ చేశారు. అక్కడి నుంచి కళాశాలలకు అనుబంధంగా ఉన్నా బిసి బాలుర, బాలికల వసతి గృహాలను తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించి, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా వృద్ధిలోకి రావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే పౌరసరఫరాల శాఖలో, ఐసిడిఎస్ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పలు మార్పులు వచ్చాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే రేషన్ దుకణాల్లో చెక్కర రూ.17, కంది పప్పు రూ.67 ఉంటే రూ.20. రూ.70 తీసుకుంటున్నట్లు లబ్దిదారులు చెబుతున్నారన్నారు. చిల్లర లేక పోవడంతో ఇలా తీసుకుంటున్నట్లు తేలిందన్నారు. అయితే ఒక కార్డుకు రూ.6 ప్రకారం లెక్కిస్తే దాదాపు ఒక చౌక దుకాణంలోని 500 కార్డులకు రూ.3వేల వరకు అవినీతి జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై స్థానిక అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ అశ్వర్ధనారాయణ నాయక్, సిఎస్‌డిటి అరతి, మండల విద్యాశాఖ అధికారి గంగప్పతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

## కర్నాటక మద్యం పట్టివేత

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మండలంలోని సుద్దకుంటపల్లి వద్ద కర్నాటక మద్యం తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ హరికృష్ణ తెలిపారు. సుద్దకుంటపల్లి క్రాస్ వద్ద అంజనప్ప అనే వ్యక్తి కర్నాటక మద్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుండి 288 టెట్రా ప్యాకెట్లను ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## రేషన్ బియ్యం సీజ్

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

పేదలకు పంపిణీ చేసిన చౌకధాన్యపు బియ్యంను తక్కువ ధరకు సేకరించి బ్లాక్ మార్కెట్కు తరలించి సొమ్ము చేసుకోవాలని భావించిన వారికి విజిలెన్స్ అధికారులు షాక్ ఇచ్చారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం పట్టణం నుంచి బెంగుళూరుకు బొలెరో వాహనంలో రేషన్ బియ్యం సరఫరా అవుతున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారి కె.శ్రీనివాసులు, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఏజి. అనిల్‌కుమార్‌తో పాటు బత్తలపల్లి డిప్యూటి తహశీల్దార్ షణ్ముఖకుమార్ యాదవ్, విఆర్ఓ రాణాప్రతాప్ బత్తలపల్లి సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ధర్మవరం రోడ్డులో మంగళవారం రాత్రి వాహనాన్ని సీజ్ చేశారు. రాప్తాడు మండలం మైనార్టీ కాలనీకి చెందిన ఎం. శ్రీకాంత్‌ను బొలెరో వాహన డ్రైవర్‌గా గుర్తించారు. అనంతపురం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి బియ్యంను తక్కువ ధరకు సేకరించి బెంగుళూరుకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. 80 ప్లాస్టిక్ బ్యాగులలో 4,500 కేజీల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని బత్తలపల్లి తహశీల్దార్ స్వర్ణలత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పోలీస్ స్పోర్ట్స్, గేమ్ మీట్ ప్రారంభం

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

జిల్లా ఎస్పీ ఆదేశాలతో బుధవారం ఉదయం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలోని వై జంక్షన్ వద్ద గల మైదానంలో పోలీస్ స్పోర్ట్స్, గేమ్ మీట్ ప్రారంభమైంది. ప్రారంభపు మ్యాచ్ లో ఆరు జట్లు తలపడగా డిఎఆర్, ఎఆర్ ఆర్మ్ రిజర్వు, హిందూపురం, ధర్మవరం సబ్ డివిజన్ జట్లు విజయం సాధించాయి. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హిందూపురం డిఎస్‌పి కెవి మహేష్ , డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్ సింగ్, ప్రసాద్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

**ప్రజాశక్తి-నంబులపూలకుంట**

గ్రామ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ఈవోఆర్డీ మాధవ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిపై పలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు,మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :**సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సంక్షేమ మరియు విద్యా సహాయకులు, పశు సంవర్ధక శాఖ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

**ధర్మవరం రూరల్ :** ధర్మవరం మండల ప్రజా పరిషత్తులో సుస్థిర అభివద్ధి లక్ష్యాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాయిమనోహర్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనపై దృష్టి సారించాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

మండల వ్యాప్తంగా ఉన్నా 14 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు, ప్రజలకు ఉపాధి కల్పన దిశగా దృష్టి సారించాలని మండల అభివృద్ధి అధికారిణి సరస్వతి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల వ్యాప్తంగా ఉన్నా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి) శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు శిక్షణలో నేర్చుకున్న వాటితో గ్రామల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ కెంచరాయప్ప, మండల వ్యాప్తంగా ఉన్నా పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బోరుబావి తవ్వకం

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

మున్సిపాలిటీ పరిధిలోని శిల్పారామం కాలనీలో త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం నూతన బోరు త్రవ్వకాన్ని శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. బుధవారం ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి పరిష్కారానికి నూ. 1.30 కోట్లు మంజూరు అయ్యాయని అన్నారు. శిల్పారామం కాలనీ లో రహదారులు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, మాజీ పుడా చైర్మన్ కడియాల సుధాకర్, పట్టణ పార్టీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు మహమ్మద్ రఫీ, లక్ష్మీపతి, ఉమాపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

చిలమత్తూరులోని రెవెన్యూ గ్రామసభ

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

రైతుల సమస్యలు పరిష్కరించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమనిపుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు . మండలం పరిధిలోని బైరాపురం పంచాయతీలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, సర్పంచి రవి, సిఐ ఇందిరా, వ్యవసాయ అధికారి నటరాజ్, టిడిపి నాయకులు బండ్లపల్లి కిష్టప్ప, భక్తవత్సలం నాయుడు, బోయ లక్ష్మీనారాయణ, కేసప్ప, తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి రూరల్ :** రెవెన్యూ పరంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి వాటి ద్వారా సమస్యలను గుర్తించి పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఆమె బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సర్పంచి మంగ్గీ బాయ్, టిడిపి నాయకులు శ్రీరాం నాయక్, బొమ్మయ్య, శివప్ప ఆకుల కుల్లాయప్పతో పాటు జనసేన నాయకులు శ్యామ్, పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** మండల పరిధిలోని దేమకేతేపల్లి గ్రామపంచాయతీలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. యగ్నిశెట్టిపల్లి శోత్రియం రెవెన్యూ పొలంకు సంబందించి యగ్నిశెట్టిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఈ సదస్సును నిర్వహించారు. ఈ గ్రామం రీసర్వే పూర్తయిన గ్రామం కావడంతో అధికంగా జాయింట్ ఎల్‌పిఎంపై ఫిర్యాదులు వచ్చాయి. తాము సాగులో ఉన్న భూములకి పట్టాలు ఇవ్వాలని పలువురు తహశీల్దార్ యూనస్ బాబుకి విన్నవించారు. సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని తహశీల్దార్ అన్నారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బందితో పాటు స్థానిక టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి,సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

**అగళి :** మండలంలోని ఇనగలూరు పంచాయతీలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రెవిన్యూ సమస్యలతో పాటు అర్హులైన లబ్దిదారులందరికీ సంక్షేమ పథకాలను అందజేసేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తునట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారావు, ఆయా శాఖల అధికారులు, టిడిపి నాయకులు కుమారస్వామి, శివకుమార్, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, విఆర్ఓ దొడ్డేగౌడ్, విఆర్ఎ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి :** భూ సమస్యలను పరిష్కరించడం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ స్వర్ణలత అన్నారు.. మండలంలోని దంపెట్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ భూమి, మీ హక్కు నినాదంతో భూములకు రక్షణ కల్పించేలా ల్యాండ్ గ్రాబింగ్ యాక్టర్ 2024లో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో మండల సర్వేయర్ జోసెఫ్, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, విఆర్డి నరసింహులు, గ్రామ సర్వేయర్ రవి కిరణ్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ధర్మవరం రూరల్ :** మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, సచివాలయ, పంచాయతీ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్, ఎంపీడీవో అన్నారు. బుధవారం కదిరి రూరల్ మండల బ్రాణనపల్లి సచివాలయం వద్ద రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ పోలప్ప, కదిరి బ్రాహ్మణపల్లి టీడీపీ నాయకులు చిన్నా నాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.